నమస్తే తెలంగాణ
మహబూబాబాద్
5 | బుధవారం 13 మార్చి 2024 | MAHABUBABAD


సచివాలయంలో సమీక్షిస్తున్న ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, సీతక్క, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

# ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని చాటేలా..

**భద్రకాళి ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం.. ఆగమశాస్త్ర ప్రకారం ఆలయ మాడవీధులు**

**రెండు నెలల్లో కాళోజీ కళాక్షేత్రం పనులు పూర్తి.. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్‌లో సమీక్ష.. పాల్గొన్న మంత్రులు కొండా సురేఖ, సీతక్క**

వరంగల్, మార్చి 12: ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని చాటేలా దేవాలయాలను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం సచివాలయంలో రాష్ట్ర దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి ఆయన కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనుల పురోగతి, భద్రకాళీ ఆలయ మాడవీధుల నిర్మాణంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. వరంగల్‌లోని భద్రకాళీ ఆలయ అభివృద్ధి, మాడవీధుల పనులను ఆగమశాస్త్ర ప్రకారం చేపట్టాలని సూచించారు. మాడవీధుల నిర్మాణానికి రూ.30కోట్లు మంజూరయ్యాయని, అందులో రూ.20కోట్లు ఎస్‌డీఎఫ్, రూ.10కోట్లు కుడా సమకూర్చుతున్నట్లు చెప్పారు. భద్రకాళీ ఆలయానికి 9వ అంతస్తులో రాజగోపురం నిర్మించనున్నట్లు వెల్లడించారు. భద్రకాళీ అమ్మవారి ఊరేగింపు కోసం మాడవీధులు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆలయం చుట్టూ రాతి బేస్మెంట్ నిర్మించాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ భావజాల వ్యాప్తికి కృషిచేసిన కాళోజీ నారాయణరావు పేర కళాక్షేత్రం నిర్మాణ పనులను రెండు నెలల్లో పూర్తి చేయాలని మంత్రులు సురేఖ, సీతక్క అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పనుల కంటే ఎక్కువ మొత్తంలో బిల్లులు మంజూరుపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు ఆదేశించారు. అలాగే నగరంలోని స్మార్ట్‌సిటీ, ఇతర పథకాల ద్వారా కొనసాగుతున్న అభివృద్ధి పనులపై సమావేశంలో సమీక్షించారు. అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలన్నారు. సమావేశంలో మున్సిపల్ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ దాన కిశోర్, దేవాదాయ, ధర్మాదాయ శాఖ కార్యదర్శి అనిల్‌కుమార్, హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్, కుడా ప్లానింగ్ అధికారి అజిత్ రెడ్డి, బల్దియా ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, కుడా ఈఈ భీంరావు పాల్గొన్నారు.

# గుమ్మడిదొడ్డిలో ఇంటింటా సర్వే

**వైరల్ ఆర్థరైటిస్ వల్లే మోకాళ్ల నొప్పులు : డీఎంహెచ్‌వో అప్పయ్య**

**'నమస్తే' కథనాలకు స్పందన**


గుమ్మడిదొడ్డి గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

వాజేడు, మార్చి12 : గుమ్మడిదొడ్డి గ్రామ పంచాయతీలో మంగళవారం డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య పర్యటించారు. గుమ్మడిదొడ్డి గ్రామస్తులు జ్వరాల బారిన పడిన విషయమై ఇటీవల 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. వీటికి స్పందించిన డీఎంహెచ్‌వో గుమ్మడిదొడ్డి, సుందరయ్యకాలనీ, ఇప్పగూడెం గ్రామాలను సందర్శించి వైద్య సిబ్బందితో కలిసి బాధితులను పరీక్షించారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీని తనిఖీ చేసి ప్రజలకు అందుబాటులో ఉండాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జ్వరాలు, మోకాళ్ల నొప్పులతో బాధపడే వారిని గుర్తించి 70 మందికి పైగా పరీక్షలు చేసి ల్యాబ్‌కు పంపామని చెప్పారు. తాగునీటి పరీక్షలు కూడా చేశామని తెలిపారు. చాలామందికి వైరల్ ఆర్థరైటిస్ వల్లే మోకాళ్ల నొప్పులు వస్తున్నాయని గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈ వ్యాధి లక్షణాలు ఉన్న వారికి జ్వరం తగ్గినా వారం రోజుల పాటు కీళ్ల నొప్పులు ఉంటాయన్నారు. మందులు వాడుతూ విశ్రాంతి తీసుకుంటే నయమవుతుందన్నారు. గ్రామస్తులు భయపడాల్సిన అవసరం లేదని వైద్యులు చెప్పినట్లు చేస్తే సరిపోతుందన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి తహసీల్దార్ శ్రీరాముల శ్రీనివాస్, వైద్యాధికారులు రహీల్, మహేందర్, అభినవ్, హెల్త్ సూపర్‌వైజర్ కోటిరెడ్డి పాల్గొన్నారు.

# భోజనానికి ఆలస్యంగా వచ్చాడని..

**విద్యార్థిపై అసిస్టెంట్ కేర్ టేకర్ ప్రతాపం**

**దవడ పన్ను ఊడేలా కొట్టిన వైనం.. మెమో ఇచ్చిన ప్రిన్సిపాల్**

ములుగు రూరల్, మార్చి12: భోజనానికి ఆలస్యంగా వచ్చాడని అసిస్టెంట్ కేర్ టేకర్ ఓ విద్యార్థిని కొట్టగా దవడ పన్ను ఊడిన ఘటన ములుగు మండలం మల్లంపల్లిలోని ఏటూరునాగారం సోషల్ వెల్ఫేర్ బాలుర గురుకుల పాఠశాలలో చోటుచేసుకుంది. ఈ విషయం మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. గురుకులంలో 6వ తరగతి చదువుతున్న చరణ్ సోమవారం భోజనం సమయానికి లేట్‌గా ప్లేట్ పట్టుకొని వెళ్లిన క్రమంలో అక్కడే ఉన్న అసిస్టెంట్ కేర్ టేకర్ రాజు చేయిచేసుకున్నాడు. దెబ్బ గట్టిగా తలగడంతో విద్యార్థి దవడ పన్ను ఊడి రక్తస్రావమైంది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు గురుకులానికి చేరుకొని రాజు తీరుపై మండిపడ్డారు. ఈ విషయంపై ఆరా తీసిన ప్రిన్సిపాల్ అంకయ్య అసిస్టెంట్ కేర్ టేకర్‌ను మందలించి మెమో జారీ చేశామని తెలిపారు. ఆర్సీఓ, డీసీఓల ఆదేశాల మేరకు అసిస్టెంట్ కేర్ టేకర్‌పై తదుపరి చర్యలు ఉంటాయన్నారు.


దేవరుప్పుల : ఎండిన వరి, మక్కజొన్న కంకులతో సూర్యాపేట-జనగామ హైవేపై నిరసన తెలుపుతున్న రైతులు, బీఆర్‌ఎస్ శ్రేణులు

# నాణ్యమైన కరెంట్, సాగునీరు ఇవ్వాలి

**తక్షణమే కాల్వల ద్వారా చెరువులు నింపాలి**

**బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రైతుల నిరసన**

**దేవాదుల రిజర్వాయర్లలో నీళ్లున్నా విడుదల చేయని కాంగ్రెస్ సర్కారు**

**ఎండుతున్న పంటలపై దేవరుప్పల, పాలకుర్తిలో ఆందోళన**

**ఎకరాకు రూ.20 వేలు పరిహారం ఇవ్వాలని డిమాండ్**

దేవరుప్పుల/పాలకుర్తి రూరల్, మార్చి 12: దేవాదుల రిజర్వాయర్లలో నీళ్లున్నా యాసంగి పంటలకు సర్కారు విడుదల చేయకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తూ రైతులు ఆందోళన చేపట్టారు. జనగామ జిల్లా దేవరుప్పుల, పాలకుర్తి మండల కేంద్రాల్లో మంగళవారం రైతులు, బీఆర్‌ఎస్ శ్రేణులు రాస్తారోకో నిర్వహించి ఎండిన వరి, మక్కజొన్న కర్రలతో నిరసన వ్యక్తం చేశారు. దేశానికి అన్నంపెట్టే అన్నదాతలను పాలకులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పల్లా సుందరరాంరెడ్డి, పాలకుర్తి ఎంపీపీ నల్లా నాగిరెడ్డి మాట్లాడుతూ దేవాదుల రిజర్వాయర్లలో జలాలున్నా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో వరి, మక్కజొన్న పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టపరిహారంగా ఎకరాకు రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నేతలు రైతులకు ఎన్నో హామీలిచ్చి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చాక విస్మరించారన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో వ్యవసాయాన్ని పండుగలా మార్చామని, సాగునీటి సమస్య లేకుండా చూశామని గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో రైతులందరికీ రైతుబంధు సాయం అందలేదని, రూ.2 లక్షల రుణమాఫీ నెరవేరలేదన్నారు. దీనిపై రైతులంతా ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, ప్రధాన కార్యదర్శి చింత రవి, నాయకులు బస్వ మల్లేశ్, ధరావత్ రాంసింగ్, కొల్లూరు సోమయ్య, కారుపోతుల భిక్షపతి, పాము మోహన్, మైదం జోగేశ్వర్, హనుమంతు, వంగ అర్జున్, బోనగిరి యాకస్వామి, మేకల సంపత్, మాచర్ల బాబు, జేరిపోతుల సాయిలు, కుతాటి నర్సింహులు, గండిపల్లి యాకయ్య, తాటిపల్లి మహేశ్, బస్వ వెంకన్న, కాముని నర్సింహస్వామి, తిరుమలేశ్ పాల్గొన్నారు. పాలకుర్తిలో నిర్వహించిన రాస్తారోకోలో బీఆర్‌ఎస్ పాలకుర్తి మండల అధ్యక్షుడు పసునూరి నవీన్‌కుమార్, నాయకులు బొబ్బల అశోక్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వీరమనేని యాకాంతారావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముస్కు రాంబాబు, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మాచర్ల ఎల్లయ్య, పాము శ్రీనివాస్, కమ్మగాని నాగన్న, తాడెం రవి, గూడ రాఘవులు, మాటూరి యాకయ్య, నకీర్త యాకయ్య, కల్వల భాస్కర్‌రెడ్డి, ఎండీ మదార్, ఎండీ సర్వర్ ఖాన్, కడుదుల కర్ణాకర్‌రెడ్డి, పోశాల వెంకన్న, మారుజోడు సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.


భూక్య కృష్ణతేజ్ (ఫైల్)

# ఆత్మహత్యా? హత్యా?

**వర్ధన్నపేట ఎస్సారెస్పీ కెనాల్‌లో యువకుడి మృతదేహం**

**నాలుగు రోజుల్లో పెళ్లి.. అంతలోనే విషాదం**

హనుమకొండ చౌరస్తా/వర్ధన్నపేట, మార్చి 12 : మరో నాలుగు రోజుల్లో పెళ్లిపీటలు ఎక్కాల్సిన యువకుడు విగతజీవిగా మారాడు. పెళ్లి పత్రికలు పంచేందుకు వెళ్లి గల్లంతైన ఆ యువకుడు ఎస్సారెస్పీ కాల్వలో మంగళవారం శవమై తేలాడు. వివరాలిలా ఉన్నాయి. హనుమకొండలోని గోకుల్‌నగర్‌కు చెందిన భూక్య కృష్ణతేజ్(29)కు నర్సంపేటకు చెందిన యువతితో ఈ నెల 16న వివాహం నిశ్చయమైంది. ఈ క్రమంలో సోమవారం పెళ్లి పత్రికలు పంచేందుకు ఇంటి నుంచి వెళ్లి కృష్ణతేజ్ అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యులు, బంధువులు ఎంత వెతికినా ఆచూకీ దొరకలేదు. పలివేల్పులలోని ఎస్సారెస్పీ కెనాల్ వద్ద అతడి బైక్ దొరికింది. కాల్వలో కృష్ణతేజ పడిపోయి ఉంటాడనే అనుమానంతో కాకతీయ యూనివర్సిటీ పోలీసులు గాలించారు. మంగళవారం వర్ధన్నపేట మండలం ఇల్లంద శివారులోని ఎస్సారెస్పీ కాలువలో మృతదేహం ఉన్నట్లు రైతులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. అది కృష్ణతేజ మృతదేహంగా గుర్తించారు. అయితే అతడు ఆత్మహత్య చేసుకున్నాడా? ఎవరైనా చంపి కెనాల్‌లో పడేసి ఉంటారా? లేక ప్రేమ వ్య వహారం ఏదైనా ఉందా అనే కోణంలో వి చారణ జరుపుతున్నారు. కృష్ణతేజ మృతితో గోకుల్‌నగర్‌లో విషాదం నెలకొంది.

# బీఆర్‌ఎస్‌కు కార్యకర్తలే బలం

**పార్లమెంట్ ఎన్నికల్లో కష్టపడి పనిచేయాలి**

**గతంలో ఇచ్చిన మెజార్టీని నిలబెట్టాలి**

**మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత**


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మాలోత్ కవిత

ములుగు, మార్చి 12(నమస్తే తెలంగాణ) : బీఆర్‌ఎస్‌కు కార్యకర్తలే బలమని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ శ్రేణులు కష్టపడి పనిచేయాలని మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత కోరారు. ములుగు నియోజకవర్గంలో గత పార్లమెంట్ ఎన్నికల్లో ఇచ్చిన మెజార్టీని నిలబెట్టాలన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని బీఆర్‌ఎస్ భవన్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు కే లక్ష్మీనర్సింహారావు అధ్యక్షతన ములుగు, వెంకటాపూర్ మండలాల పార్టీ నాయకులతో పా ర్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీ కవిత, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్‌తో కలిసి పాల్గొన్నారు. ముందుగా పార్టీ గ్రామ అధ్యక్షులు, ముఖ్య నాయకులు అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎదురైన అనుభవాలు, గ్రామాల్లో ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలియజేశారు. అనంతరం ఎంపీ కవిత మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన అన్ని విషయాలను అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేసేందుకు కార్యకర్తలంతా సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పదేళ్లలో ములుగు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన ఘనత బీఆర్‌ఎస్‌కే దక్కుతుందన్నారు. గిరిజన యూనివర్సిటీని ములుగు ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని గుర్తుచేశారు. ఎన్నికల్లో బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధిని వివరిస్తూ ఓట్లను అభ్యర్థించాలని సూచించారు. గ్రూప్ రాజకీయాలు పక్కనపెట్టి అందరూ సహకరించాలని ఈ సందర్భంగా ఎంపీ కవిత కోరారు. సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గోవింద్‌నాయక్, బీఆర్‌ఎస్ నాయకులు లింగాల రమణారెడ్డి, గై అశోక్, భూక్యా మురళి, పట్టణ అధ్యక్షుడు చెన్న విజయ్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు విజయ్‌రామ్ నాయక్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సమాజానికి నాటకాలు దర్పణం వంటివి

**కో ఆపరేటివ్ ట్రిబ్యునల్ చైర్మన్ వై.సత్యేంద్ర**

పోచమ్మమైదాన్, మార్చి 12: నేటి సమాజానికి నాటకాలు దర్పణం వంటివని కో ఆపరేటివ్ ట్రిబ్యునల్ చైర్మన్ వై.సత్యేంద్ర అన్నారు. సహృదయ సాహిత్య, సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో నిర్వహిస్తున్న నాటక ప్రదర్శనలను మంగళవారం రాత్రి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. నాటక ప్రదర్శనల ద్వారా సమాజంలో మార్పులు రావాలని, అప్పుడే ప్రజల్లో చైతన్యం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. రామం చిట్‌ఫండ్స్ అధినేతలు బన్న సుధాకర్, రామోజు గిరిబాబు, పారితోషికదాతలు, కళా రాజేశ్వర్‌రావు, బి.పురుషోత్తమరావు ప్రసంగించారు. సంస్థ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్‌వీఎన్ చారి సంయోజకత్వం చేయగా, కుందావఝుల కృష్ణమూర్తి ప్రార్థనగీతం ఆలపించారు. కళాంజలి హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతే రాజు, సిరిమువ్వ కల్చరల్స్ హైదరాబాద్ ఆధ్వర్యంలో మంజునాథ దర్శకత్వంలో ప్రదర్శించిన హక్కు నాటికలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.


హక్కు నాటికలోని ఓ సన్నివేశం

# వందేభారత్ రైళ్లను సద్వినియోగం చేసుకోవాలి

కాజీపేట/ఖిలావరంగల్, మార్చి 12 : వందేభారత్ రైళ్లను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని రైల్వే సీనియర్ డీఈఈ ప్రశాంత్ కృష్ణసాయి కోరారు. సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య కొత్తగా ప్రవేశపెట్టిన వందే భారత్ రెండో రైలును ప్రధాని మోదీ ఢిల్లీ వేదికగా వర్చువల్‌గా ప్రారంభించారు. అలాగే, కాజీపేట రైల్వే జంక్షన్‌లో ఏర్పాటుచేసిన చేనేత స్టాల్స్‌ను కూడా ప్రారంభించారు. సికింద్రాబాద్ నుంచి వచ్చిన వందేభారత్ రైలుకు కాజీపేట రైల్వే జంక్షన్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్వాగతం పలికారు. స్టేషన్ మాస్టర్ సత్యనారాయణరెడ్డి, సీసీఐ సజ్జన్ లాల్, సీటీఐ విజయ్‌కుమార్, టెస్కో హ్యాండ్లూమ్ డీఎంవో కృష్ణహరి, రైల్వే జనరల్ ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్ పాల్గొన్నారు. అలాగే, వరంగల్ రైల్వేస్టేషన్‌లో 'ఒకే స్టేషన్ ఒక ఉత్పత్తి' అనే నినాదంతో ఏర్పాటు చేసిన స్టాల్‌ను సీనియర్ డీఎంఏ స్వరాజ్‌కుమార్ ప్రారంభించారు. రెండో వందే భారత్ రైలుకు స్వాగతం పలికారు. డీఎస్‌టీ హేమంత్‌కుమార్, ఏడీఈఈ రాజమోహన్, సీసీఐ రాజగోపాల్, ఎస్ఎంఆర్ బలరాం నాయక్ పాల్గొన్నారు.


ఖిలావరంగల్ : వరంగల్ రైల్వేస్టేషన్‌లో రైలుకు స్వాగతం పలుకుతున్న రైల్వే అధికారులు


